

50 మంది వైద్య విద్యార్థులు రక్తదానం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది వైద్య విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.స్లీవరాజ్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్త మార్పిడి చికిత్స పొందుతున్న తలసేమియా వ్యాధి చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. సంవత్సరానికి మూడు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రక్తదానం చేసిన వైద్య విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజేష్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఎల్.ఫిలిక్స్, డాక్టర్ ఎం.పావన సంధ్య, డాక్టర్ జి.స్పందన, పిఆర్ఒ కెవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ముసురు ముంచేస్తోంది..!

మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షం
రెండు జిల్లాల్లో 36 వేల ఎకరాల్లో వరిపొలాలు మునక
మూడు వేల ఎకరాల్లో ముంపులో నారుమడులు
గోదావరికి పెరుగుతున్న వరద ఉధృతి
ప్రమాదపుటంచున కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు
పోలవరం వద్ద 5.87 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



వేలేరుపాడు మండలం అల్లూరి నగర్‌లో మిగిలిన ఇళ్ల శిథిలాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన మూడు రోజులుగా వీడని ముసురుతో రెండు జిల్లాల ప్రజలు తీవ్ర కష్టనష్టాలను చవిచూస్తున్నారు. భారీ వర్షాలకు ఇప్పటికే ఏలూరు జిల్లాలో 4,094 ఎకరాల్లో నాట్లు, 196 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. 146 గ్రామాల పరిధిలో 3,580 మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 32,427 ఎకరాల్లో వరినాట్లు, 2,751 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిన్నాయి. 20 మండలాల పరిధిలోని 263 గ్రామాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. 17,557 మంది రైతులు బాధితులయ్యారు. వర్షాలకు ఎక్కడికక్కడే చెట్లు విరిగిపడి రాకపోకలు స్తంభిస్తున్నాయి. శనివారం సైతం ఏలూరు జిల్లాలో 98.6 మిల్లీమీటర్లు, 'పశ్చిమ'లో 34.2 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. ఎడతెరిపిలేని వర్షంతో జనం ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో జనజీవనం స్తంభించింది. వ్యాపారాలు కుంటుపడ్డాయి. రోజువారీ పనులకు వెళ్లేవారికి ఉపాధి లేకుండాపోయింది. ఎక్కడికక్కడే రోడ్లు దెబ్బతినడంతో జనం ప్రయాణం చేయలేని దుస్థితి ఏర్పడింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పడంతో జనం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలకు జ్వరాలు, అనారోగ్య సమస్యలు విజృంభిస్తున్నాయి. డ్రెయిన్లలో మురుగునీరు పొంగి రోడ్లపైకి చేరడంతో దోమలు చుట్టుముడుతున్నాయి. గ్రామ, పట్టణాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో జనంలో తీవ్ర ఆందోళన నెలకొంది.

ప్రమాదపుటంచున వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు


భారీ వర్షాలు, ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చి పడుతున్న వరద నీటితో గోదావరి ఉధృతి పెరుగుతోంది. శుక్రవారం 26 అడుగులు ఉన్న భద్రాచలం వద్ద నీటిమట్టం శనివారానికి 31 అడుగులకు చేరింది. పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 28 మీటర్ల నుంచి 30 మీటర్లకుపైగా నీటిమట్టం చేరింది. దాదాపు ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే విలీన మండలాల్లో భారీ వర్షాలకు రహదారులన్నీ నీట మునిగాయి. దీంతో దాదాపు 25 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వరద ఉధృతి పెరిగితే గ్రామాల్లోకి వరద నీరు చేరనుంది. అదే జరిగితే జనం పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాల్సి వస్తుంది. గడిచిన రెండేళ్లలో అనుభవించిన వరద ఇబ్బందులను గుర్తుకుతెచ్చుకుని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తగిన విధంగా ముందస్తు చర్యలు తీసుకోకపోతే జనం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

పెద్దవాగు ముంపు బాధితుల ఆర్తనాదాలు

తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలంలోని గుమ్మిడిపల్లి వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడిన ఘటనలో వేలేరుపాడు మండలంలోని 15 గ్రామాల ప్రజలు సర్వంకోల్పోయి రోడ్డున పడ్డారు. దెబ్బతిన్న ఇళ్లు చూసి కన్నీరుమున్నీరవుతున్నారు. పశువులు మృతి చెందడం, వ్యవసాయ పనిముట్లు కొట్టుకుపోవడంతోపాటు ప్రతి కుటుంబానికీ తీవ్ర ఆస్తినష్టం సంభవించింది. దీంతో కట్టుబట్టలతో అక్కడి ప్రజలు మిగిలిపోయారు. ఆదుకుంటామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇస్తున్నారు. ఒక్కరాత్రిలో సర్వంకోల్పోయిన బాధితుల ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. ఒక్కో కుటుంబానికి తక్కువగా లెక్కించినా రూ.నాలుగు లక్షల వరకూ ఆస్తినష్టం ఉంటుందని బాధితులు చెబుతున్నారు. 200 ఎకరాల్లో నాట్లు నాటిన పొలాలు, 50 ఎకరాల్లో నారుమడులు, 130 ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల్లో తేల్చింది. రోడ్లకు సంబంధించి రూ.కోటి 14 లక్షలు నష్టం ఉంటుందని ఆర్అండ్‌బి అంచనా వేసింది. పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే కొద్దీ తమ పరిస్థితి ఏమిటనే భయం అక్కడి ప్రజలను వెంటాడుతోంది. తమను నిర్వాసితులుగా గుర్తించి ప్యాకేజీ ఇచ్చి, మెరక ప్రాంతంలో ఇళ్లు నిర్మించి తమను తరలించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు ఇంటి వద్దకే భోజనం

సహాయక చర్యల్లో అలసత్వాన్ని సహించం - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి



వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - వేలేరుపాడు

వరద బాధిత కుటుంబాలకు ఇంటి వద్దకే భోజనం అందించాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అధికారులను ఆదేశించారు. మండలంలో వరద ప్రభావిత ప్రాంతాలను శనివారం పరిశీలించిన అనంతరం మేడేపల్లిలోని గ్రామ సచివాలయంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజుతో కలిసి వరద సహాయక చర్యలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు మరో రెండురోజుల పాటు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా అధికారులు వరద సహాయక చర్యలపై పూర్తిస్థాయిలో కేంద్రీకరించాలన్నారు. వరదల కారణంగా బాధితుల ఇళ్లు దెబ్బతిని, సామగ్రి వరద నీటిలో కొట్టుకుపోయాయన్నారు. బాధిత కుటుంబాలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలను వారి ఇళ్ల వద్దకే అందించాలన్నారు. అందుకు అవసరమైన నిత్యావసర సరుకులను వంట చేసే ఏజెన్సీ వాళ్లకు అందించాలన్నారు. ఆహారాన్ని బాధితులకు సక్రమంగా అందించే విషయం పరిశీలించేందుకు ప్రతి గ్రామంలోనూ ఆ గ్రామానికి చెందిన విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి, గ్రామంలో ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల వారితో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బాధిత కుటుంబానికీ ఎటువంటి ఫిర్యాదులూ లేకుండా ఆహారం అందించడం ఈ కమిటీల బాధ్యతన్నారు. ఉదయం అల్పాహారంతోపాటు టీ కూడా అందించాలన్నారు. చిన్న పిల్లలు ఉన్న ఇళ్లకు పాలు సరఫరా చేయాలన్నారు. తాగునీటి కొరత లేకుండా ప్రతి ఇంటికీ వాటర్ ప్యాకెట్ల బస్తాను అందించాలని, అంతేకాక ట్యాంకర్ల ద్వారా తాగునీరు ప్రతి గ్రామంలోనూ అందించాలన్నారు. పూర్తిస్థాయిలో ఇళ్లు దెబ్బతిన్న వారికి టార్పాలిన్లు అందించాలన్నారు. పశువులకు అవసరమైన పశుగ్రాసం అందించాలని పశు సంవర్ధక శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బంది లేకుండా సహాయ చర్యలకు ఆటంకం కలగుండా కనెక్టివిటీ రోడ్లను అత్యవసరంగా మరమ్మతులు నిర్వహించాలన్నారు. వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒను మంత్రి ఆదేశించారు. సహాయక చర్యలు పకడ్బందీగా నిర్వహించాలని సిఎం ఆదేశించారని, అధికారులు, సిబ్బంది ఎటువంటి అలసత్వాన్ని ప్రదర్శించినా తీవ్రంగా పరిగణిస్తామని మంత్రి హెచ్చరించారు. వారి వెంట జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ఎంఎల్ఎలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డిఎస్ఒ ఆర్ఎస్.సత్యనారాయణరాజు, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మంజుభార్గవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటాం
అల్లూరినగర్, మేడిపల్లిలో బాధితులకు మంత్రి పరామర్శ

వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద బాధితులను ఎంఎల్ఎలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా అధికారులతో కలిసి శనివారం కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి వేలేరుపాడు మండలం అల్లూరినగర్, మేడిపల్లిలో వరద కారణంగా దెబ్బతిన్న ప్రతి ఇంటినీ పరిశీలించి, ప్రతి బాధిత కుటుంబం వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు వరద కారణంగా తాము సర్వస్వం కోల్పోయామని, తమను ఆదుకోవాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఇళ్లు పూర్తిగా కోల్పోయినవారికి ఇల్లు అందించడంతోపాటు, పంటలు, పాడి పశువులు కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందిస్తామన్నారు. అనంతరం మేడిపల్లిలో నిత్యావసర వస్తువుల స్టాక్ పాయింట్‌ను మంత్రి పరిశీలించారు. ముందుగా మంత్రి పెద్దవాగుపై కుమ్మరిగూడెం వద్ద వరద కారణంగా దెబ్బతిన్న వంతెనను పరిశీలించారు.

వరద గోదావరి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరుల్లోని వరద నీరు పెద్దఎత్తున గోదావరిలోకి చేరుతోంది. గోదావరిలోకి ఎగువ ప్రాంతాల నుండి అదనపు జలాలు వస్తుండడంతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పట్టిసీమ ఆలయానికి నలువైపులా ఇసుక తిన్నెలు నీటమునిగాయి.

వాగుల విధ్వంసం.. జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తడంతో మండలంలో పలుచోట్ల రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ములగలంపల్లి-రౌతుగూడెం మధ్యలో నిర్మించిన ఎలకల కల్వర్టు వరద ప్రవాహానికి దెబ్బతింది. పి.అంకంపాలెం నుంచి కొరుటూరు నిర్వాసిత గ్రామానికి వెళ్లే రహదారిపై నెల రోజుల క్రితం నిర్మించిన కల్వర్టు సైతం వరదలకు దెబ్బతింది. దీంతో ప్రయాణికులు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వర్ణవారిగూడెం, ములగలంపల్లి, అంకన్నగూడెం గ్రామాలకు వెళ్లే రహదారిసైతం దెబ్బతినడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



బుట్టాయగూడెం: దెబ్బతిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

ఆగిరిపల్లి: మండల పరిధిలోని గొల్లగూడెం కుశలవ ఇంటర్నేషనల్ కంపెనీ వద్ద నూజివీడు-విజయవాడ రోడ్డుపై శనివారం ఉదయం వీచిన ఈదురుగాలులకు పెద్ద వృక్షం విరిగి అడ్డంగా పడింది. దీంతో ఈ మార్గంలో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ ఎఇ వీరబాబు తమ సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన పడిపోయిన చెట్టును తొలగించటంతోపాటు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

కామవరపుకోట: భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిపై తడికలపూడి గ్రామ శివార్లలో జెర్సీ పార్లర్ సమీపంలో పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. ఆ సమయంలో అటువైపుగా ఎవరూ రాకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అధికారులు వెంటనే స్పందించి ఆ చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు వెంబడి ఇంకా ఎక్కడైనా ఎండిపోయిన వృక్షాలు ఉంటే వాటిని గుర్తించి తొలగించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ముదినేపల్లి: వర్షాలకు మండలంలోని వరిచేలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఊటుకూరు, పొద్దుగాక, ముదినేపల్లి, ఉప్పరగూడెం, చినపాలపర్రు తదితర గ్రామాల్లోని వరి పైరు నీట మునిగింది. నెలలోపు వెదజల్లిన వరి చేలు నీటిలో పూర్తిగా మునిగిపోయినట్లు రైతులు చెబుతున్నారు. విత్తనాలు వెదజల్లి నెల రోజులు పైబడిన చేలు మాత్రం పర్వాలేదంటున్నారు. నీటిలో మునిగిన పైరును ఏ విధంగా రక్షించుకోవాలో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.8 వేలు వరకు పెట్టుబడులు పెట్టామని ముదినేపల్లికి చెందిన కౌలు రైతు ఉప్పల రాజా తెలిపారు. డ్రెయిన్లు ఆక్రమణకు గురికావడంతో చేలల్లోని నీళ్లు బయటికి వెళ్లే మార్గం లేకుండా పోయిందన్నారు. అన్నవరం, పెదలంక, పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్లు ఎగువ నుంచి వచ్చే వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. డ్రెయిన్లన్నీ వరద నీటితో ఎదురు తన్నడంతో చేలలోని నీరు లాగడం లేదు. మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే పైరు నీటిలో చచ్చిపోతుందని, మళ్లీ విత్తనాలు కొనుగోలు చేసి నారుమడులు వేసి, నాట్లు వేసుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి డ్రెయిన్లల్లో, పంట బోదెల్లో పూడికతీత చేస్తే తప్ప వరద నీరు బయటికి వెళ్లే అవకాశం లేదని ఆవేదన చెందుతున్నారు.



జీలుగుమిల్లి: వరద ఉధృతికి దెబ్బతిన్న వంతెన అప్రోచ్ రోడ్డు

పోలవరం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాగులు, రిజర్వాయర్లు చెరువులు పొంగిపొర్లుతున్నాయి. శనివారం ఉదయం నుండి మండలంలో ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో గుంజవరం, పేడ్రాల కాలువల ఉధృతి ఏమాత్రం తగ్గలేదు. కొండవాగుల వరద నీరు గుంజవరం కాజ్‌వేపై నుండి ప్రవహించాయి. ఎల్ఎన్‌డి పేట రిజర్వాయర్లోకి కొండవాగుల వరద నీరు వచ్చి చేరడంతో రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. ఎల్ఎన్‌డిపేట రిజర్వాయర్ సామర్థ్యం 90.05 టిఎంసిలవ్వగా ప్రస్తుతం రిజర్వాయర్లో 88.05 టిఎంసిల నీరు ఉందని, ఒక గేటు ద్వారా 250 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసినట్లు ఎఇ కొండలరావు తెలిపారు. కడెమ్మ కాలువ, కొవ్వాడ కాలువల్లోకి వరద జలాలు చేరి పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిస్, కడెమ్మ స్లూయిస్‌ల ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పోలవరం డిఎస్‌పి సురేష్ కుమార్ రెడ్డి, సిఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఇ దేవప్రకాష్, కొవ్వాడ కాలువ రిటైర్డు డిఇఇ సిహెచ్.భాస్కరరావు ఎల్ఎన్‌డి పేట రిజర్వాయర్‌ను పరిశీలించారు. నీటి విడుదల వల్ల దిగువ ప్రాంతాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

గోడకూలి వృద్ధురాలు మృతి

మండవల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇంటి మట్టి గోడ కూలి వృద్ధురాలు మృతి చెందిన ఘటన అయ్యవారి రుద్రవరం గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చెందిన వట్టిప్రోలు నందిమ్మ (80) మట్టి గోడలతో నిర్మించిన రేకుల షెడ్డులో నివాసం ఉంటుంది. అదే గ్రామంలో కుమారుడు వేరేచోట నివాసం ఉంటున్నాడు. మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మట్టిగోడలు తడిచి నానిపోయాయి. శుక్రవారం సాయంత్రం సుమారు 5:30 గంటల ప్రాంతంలో ఇంట్లోనే ఉన్న నందిమ్మపై మట్టి గోడ పడిపోయింది. ఆ సమయంలో వర్షం కురుస్తుండటంతో జనసంచారం తక్కువగా ఉండి ఎవరూ గమనించలేదు. రాత్రి ఏడు గంటల తర్వాత అటువైపు వెళ్తున్న వారు గోడ కూలిపోయి ఉండటం గమనించి ఇంటి వద్దకు వెళ్లి చూడగా నందిమ్మ మట్టికింద చిక్కుకున్నట్లు గుర్తించారు. స్థానికులు వెంటనే స్పందించి మట్టి శిథిలాలు తొలగించి కొన ఊపిరితో ఉన్న నందిమ్మను హుటాహుటీన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మతి చెందినట్లు బంధువులు తెలిపారు.

తక్షణం వరద బాధితులను ఆదుకోవాలి

వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న నేతలు

ప్రజాశక్తి - వేలేరుపాడు

పెదవాగు ప్రాజెక్టు వరద ప్రభావిత గ్రామాలైన మేడిపల్లి, అల్లూరినగర్, కోయధామారంల్లో సిపిఎం బృందం శనివారం పర్యటించింది. ఆయా గ్రామాల్లో వరద బాధితులను పరామర్శించి ఇబ్బందులును అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ వరదొచ్చి మూడు రోజులవుతున్నా తమను పట్టించుకున్న వారు లేరని వాపోయారు. వరద ప్రభావం వల్ల సర్వం కోల్పోయామని, కట్టుబట్టలతో ఉన్నామని తెలిపారు. కనీసం కప్పుకోవడానికి దుప్పట్లు, ఇళ్లు కొట్టుకుపోయిన వారికి పైకప్పుగా వేసుకోవడానికి బరకాలు గాని ఇవ్వలేదని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి చూసెళ్తున్నారు తప్ప కనీసంగా సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం వరదలో కొట్టుకుపోయిందని తెలిపారు. ఓపక్క వర్షం.. మరోపక్క చలితో ఇబ్బందిపడుతున్నామని, బరకాలు లేక వర్షంలో తడుస్తున్నామని వాపోయారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ పెదవాగు వరద బాధితుల పరిస్థితి హృదయ విదారకంగా ఉందన్నారు. కేవలం పర్యటనలు, ప్రకటనలకు పరిమితం కాకుండా తక్షణం వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తెల్లం దుర్గారావు, మొడియం నాగమణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. విలాపం..!



భారీ వర్షాలతో రెండు జిల్లాల్లోని ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఓ పక్క వరదల ముప్పు.. మరోపక్క పంటలు నీట మునగడంతో అంతా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇదే క్రమంలో ఈ కష్టనష్టాల వెనకున్న పాలకుల వైఫల్యాలు తెరపైకొస్తున్నాయి.

ఓ మోస్తారు వర్షాలతో ప్రారంభమై ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురవడంతో డెల్టాలో పంటలు నీట మునగ్గా.. ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగి రవాణా వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయి. దీంతో వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో పలు గ్రామాల నడుమ రాకపోకలు స్తంభించడంతోపాటు వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థ స్తంభించింది. ఇక పెదవాగు సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పెదవాగు ఉధృతికి అల్లూరినగర్ వద్ద కారు కొట్టుకుపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. స్థానికులు ప్రాణాలకు తెగించి ఐదుగురి ప్రాణాలను కాపాడారు. బుట్టాయగూడెం మండలం గుబ్బల మంగమ్మ గుడి వద్ద చిక్కుకున్న 150 మందిని స్థానికులు, రెవెన్యూ అధికారులు చాకచాక్యంగా బయటకు తీసుకొచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అదే మండలంలో కాజ్‌వేపై నిలిచి వరదలో చిక్కుకున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్సును రెవెన్యూ అధికారులు, యాత్రికులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చి ఏడుగురు విద్యార్థులను కాపాడారు. అదే రోజు రాత్రి తెలంగాణాలోని పెదవాగుకు గండిపడడంతో వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలకు కంటి మీద కునుకు కరువైంది. సుమారు 20 గ్రామాల వరకూ వరద ప్రభావానికి గురవ్వగా ఐదు గ్రామాల్లో ప్రజలు సర్వం కోల్పోయి తీవ్రంగా నష్టపోయారు. ఇంట్లో సామగ్రితోపాటు ఆరుబయట కట్టిన పశువులు సైతం కొట్టుకుపోయి మృత్యువు పాలయ్యాయి. ఆస్తినష్టం తీవ్రంగా ఉన్నా ప్రాణాపాయం లేకుండా చాలామంది సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీయడంతోపాటు ప్రాణనష్టం లేకుండా పోయింది. పెదవాగుకు గండి, కాజ్‌వేలపై రాకపోకలు నిలిచిపోవడం, రోడ్లు కొట్టుకుపోవడం, డెల్టాలో పొలాలు నీట మునగడం పాలకుల వైఫల్యాలను మరోసారి తెరపైకి తెచ్చాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

కాజ్‌వేలపై వంతెనలు నిర్మించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. అవి ప్రతిపాదనల దశకు చేరుకోకపోవడం విచారకరం. అదే సమయంలో కొన్నింటికి ప్రతిపాదనలతోపాటు టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించినా ఇప్పటికీ అతీగతీ లేని పరిస్థితికి పట్టిన్నపాలెం వంతెన పనులే నిదర్శనం. ఐటిడిఎకు వెళ్లే మార్గం, రెడ్డిగణపవరం వెళ్లే మార్గంలో పలుచోట్ల వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఇక విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. పోలవరం ముంపులో ఉన్నారనే పేరుతో అక్కడ రోడ్లు సైతం మరమ్మతు చేయడం ఆపేశారంటే ప్రభుత్వం నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక కాజ్‌వేలు, కల్వర్టుల నిర్వహణ సక్రమంగా లేక కొద్దిపాటి వర్షం, వరదలకే దెబ్బతింటున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం కాజ్‌వేలు, కల్వర్టులు, రోడ్లపై ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక డెల్టాలో మురుగు కాల్వల్లో గుర్రపుడెక్క, తూడు వంటివి తొలగించకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. కాల్వలకు నీరు వదిలే ముందైనా ఒఅండ్ఎ పనుల కిందైనా మురుగుకాల్వలను బాగు చేయాల్సి ఉంది. వర్షాలు ప్రారంభమయ్యాక రసాయనాల పిచికారీ ద్వారా గుర్రపుడెక్కను నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నారు. దానివరకూ బాగానే ఉంది. ఆ వ్యర్థాలైనా ఎలా దిగువకు వెళ్తాయనేది అందరి ప్రశ్న. ఇదే క్రమంలో భారీ వర్షాలు డెల్టాను ముంచెత్తాయి. దీంతో పొలాల్లో చేరిన నీరు సక్రమంగా లాగక రైతులు తల్లడిల్లుతున్నారు. అలాగే వదిలేస్తే నారు, నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. దీంతో మోటారు ఇంజిన్లు పెట్టి నీటిని తోడుతున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. కొన్నిచోట్ల నాట్లు దెబ్బతినడంతో నారు కోసం పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. మొత్తంగా పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా సార్వా సాగు ప్రారంభంలోనే వరి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

ఏదేమైనా భారీ వర్షాలు, వరదలు జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట, డెల్టా ప్రాంత ప్రజలు, రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు తాత్కాలిక చర్యలు, పరామర్శలతో సరిపెట్టకుండా నష్టపరిహారం ఇప్పించడంతోపాటు సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి - ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్



దెబ్బతిన్న వరి నాట్లను చూపుతున్న రైతులు, నేతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కైకరంలో ఎపి రైతుసంఘం, ఎపి కౌలురైతుల సంఘం నేతలు పర్యటించారు. భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పొలాలను పరిశీలించారు. రైతులు, కౌలురైతులను అడిగి నష్టం వివరాలను, ముంపునకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు పంటలు ముంపునకు గురై అన్నదాతలు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.12 వేలకుపైగా పెట్టుబడి పెట్టారన్నారు. వరద నీరు కిందకు వెళ్లకపోతే నాట్లు వేసిన వరి చేలు కుళ్లిపోతాయన్నారు. ఎర్రకాలువ నుండి తాడిపూడి కాలువలోకి వర్షపు నీరు వచ్చి ఆ నీరు వాగుల ద్వారా కొల్లేరులోకి, చెరువుల్లోకి వెళ్లే మార్గం లేక వందలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. కాలువలు, మురుగు డ్రెయిన్లు ఆధునికీకరించకపోవడం, వాగుల ద్వారా వర్షపు నీరు చెరువుల్లోకి మళ్లించే మార్గాలు ఏర్పాటు చేయకపోవడం ముంపునకు కారణమని తెలిపారు. నష్టపోయిన రైతులకు, కౌలురైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలని కోరారు. పంటల ముంపు నివారణకు శాశ్వత చర్యలు చేపట్టి అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు బాలిక వసతిగృహాన్ని నూజివీడు ఆర్‌డిఒ భవానీశంకరి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారికి ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వార్డెన్ వి.వెంకటరమణకు సూచించారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రస్తుతం అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు నూజివీడు ప్రాంతంలో వ్యవసాయం పెద్దగా నష్టం లేదని, ఈ వర్షం వల్ల వ్యవసాయదారులకు లాభమే అని నూజివీడు వ్యవసాయాధికారి చాముండేశ్వరి అన్నారు. ఒకవేళ నారుమడి మునిగి ఉంటే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంట ముంపునకు గురవుతుందన్నారు. వర్షాలకు నారుమడిలో విత్తనం చల్లిన రెండు మూడు రోజుల వయసులో మూడు రోజులు కన్నా ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసివేయాలన్నారు.

కళాశాలలు నిర్వహించినవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్ ఆదేశాలను పక్కనపెట్టి కళాశాలలు నిర్వహించినవారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.జెస్విన్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల కారణంగా శుక్రవారం సాయంత్రం కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలన్నిటికీ సెలవు ప్రకటించిన ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను పక్కనపెట్టి శనివారం సెయింట్ థెరిసా డిగ్రీ మహిళా కళాశాల, ఏలూరు ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహించారన్నారు. ఈ రెండు కళాశాలలపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పాఠశాల భవనంపై నుంచి పడిన విద్యార్థి

తప్పిన పెను ప్రమాదం - ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి - మండవల్లి

పాఠశాల భవనం రెండో అంతస్తు నుంచి ఒక విద్యార్థిని కింద పడిన ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రవరం గ్రామానికి చెందిన పురం వెంకట సాయి కిరణ్ మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలోని రెండో అంతస్తులో ఉన్న పాఠశాల గదిలో ఆరో తరగతి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. శుక్రవారం ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో పాఠశాల విరామ గంట మోగడంతో విద్యార్థులంతా బయటకు వచ్చారు. ఆ సమయంలో పై అంతస్తులో ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో సాయికిరణ్ బంతి కోసం కిందికి చూస్తూ అక్కడి నుంచి కింద పడిపోయాడు. దీంతో తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. విద్యార్థులంతా ఈ సంఘటన పైనే చర్చించుకోవడంతో సెలవిచ్చి విద్యార్థులను ఇంటికి పంపించేశారు. అనంతరం సాయికిరణ్‌ను ఉపాధ్యాయులు ప్రభుత్వాసుపత్రికి తరలించి తల్లికి సమాచారం అందించారు. తల్లి రావడంతో సాయికిరణ్‌ను తల్లికి అప్పగించి ఉపాధ్యాయులు అక్కడ నుండి వెళ్లిపోయారు. సాయికిరణ్ నడవలేకపోవడం గమనించిన తల్లి మెరుగైన వైద్య నిమిత్తం కైకలూరు నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించారు. సాయికిరణ్ తలభాగం పట్ల స్పష్టత రాకపోవడంతో శనివారం గుడివాడలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించామని తల్లిదండ్రులు తెలిపారు. సుమారు నెల రోజులు పూర్తి పడక విశ్రాంతి అనంతరం విద్యార్థి మెరుగయ్యే అవకాశం ఉందని వైద్యులు తెలిపినట్లు తల్లిదండ్రులు చెప్పారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణం

ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే సాయికిరణ్ కింద పడిపోయాడని విద్యార్థి తండ్రి సీతయ్య అన్నారు. కనీసం మెస్సులు కూడా లేని రెండో అంతస్తులో చిన్నపిల్లలను ఎలా ఉంచారని ఆయన ప్రశ్నించాడు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నాడు. పాఠశాలల్లోని అంతస్తుల్లో మెస్‌లు ఏర్పాటు చేసి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరాడు.

బాలికలపై దాడులను అరికట్టాలి

తల్లిదండ్రులకు అవగాహనా కార్యక్రమం

ప్రజాశక్తి - మండవల్లి

బాలికలపై జరుగుతున్న అమానుష దాడులను నివారించే విధంగా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. మాతా శిశుసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఇంగిలంపాక లంక సచివాలయం పరిధిలోని మూడు తాళ్లపాడు ఇంగిలంపాకలంక గ్రామంలోని తల్లిదండ్రులకు శనివారం ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం, సంరక్షణ పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాలికలపై జరుగుతున్న అమానుష చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై తల్లిదండ్రులతో పాటు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.అనంతరం మిషన్ శక్తి, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, స్టాప్ డయేరియా వంటి పలు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎంఎల్ఎ బడేటి

ఏలూరు సిటీ :ప్రజా సమస్యల పరిష్కారమే టిడిపి కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయానికి శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్న ఆయన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పలువురు ప్రముఖులు ఎంఎల్ఎ బడేటి చంటిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చంటి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు ఎటువంటి సమస్యనైనా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేరాలు - ఘోరాలు

మామను చంపిన అల్లుడు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని ఐఎస్.జగన్నాధపురంలో దారుణం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతకాకులు లాజర్(65)పై శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో అతని అల్లుడు కొక్కిరిపాటి సుబ్బారావు బలమైన ఆయుధంతో దాడి చేయడంతో లాజర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు లాజర్ తన కుమార్తెను 20 ఏళ్ల క్రితం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కొక్కిరపాటి సుబ్బారావుకు ఇచ్చి వివాహం చేశాడు. వీరికి ఇద్దరు సంతానం. భార్యాభర్తల నడుమ విబేధాలు రావడంతో సుబ్బారావు భార్య పుట్టింటికి వచ్చేసి కూలి పని చేసుకుంటోంది. ఈ క్రమంలో కుటుంబ పోషణ కోసం కువైట్ వెళ్లేందుకు శుక్రవారం బయల్దేరి హైదరాబాద్ చేరుకుంది. తన భార్య కువైట్ వెళ్లేందుకు కారణం మామ లాజర్ అనే అనుమానంతో సుబ్బారావు శుక్రవారం రాత్రి 11 గంటలు దాటాక ఐఎస్.జగన్నాధపురం చేరుకుని నిద్రలో ఉన్న లాజర్‌పై దాడి చేశాడు. బలమైన ఆయుధంతో దాడి చేయడంతో లాజర్ అక్కడికక్కడే మృతి చెందాడు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా, డాగ్ స్క్వాడ్ సాయంతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. నిందితుడు సుబ్బారావు పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు. ఆయన గతంలో కూడా పలు కేసుల్లో నిందితునిగా ఉన్నట్లు సమాచారం. ఏలూరు డిఎస్‌పి శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి దాడిలో తండ్రి మృతి

ప్రజాశక్తి - కామవరపుకోట

తండ్రిపై కుమారుడు దాడి చేయడంతో తండ్రి మృతి చెందిన ఘటన తడికలపూడి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తడికలపూడి గ్రామనికి చెందిన నాగబోయిన శ్రీనివాసరావు (47) భార్య గతంలో చనిపోవడంతో తన కుమారడు నాగబోయిన కార్తీక్(23)తో కలిసి వేంపాడు రోడ్డులో నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన కార్తీక్ తన తండ్రి శ్రీనివాసరావుతో ఆయన పేరున ఉన్న 2.50 ఎకరాల భూమి విషయంలో అనేకసార్లు గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కుమారుడు కార్తీక్ అతిగా మద్యం తాగి ఆస్తి విషయంలో తండ్రి శ్రీనివాసరావుతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో కార్తీక్ మద్యం మత్తులో శ్రీనివాసరావుపై దాడి చేశాడు. ఈ ఘటనలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల పోలీసులకు సమాచారం అందించడంతో తడికలపూడి ఎస్ఐ జయబాబు ఘటనా స్థలానికి చేరుకుని, నిందితుడు కార్తీక్‌ని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వంతెన నిర్మించాలని సిపిఎం నిరసన



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఏజెన్సీ ప్రాంతాలకు ముఖద్వారమైన పట్టినపాలెం వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టినపాలెం వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతూ వంతెన వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎం.జీవరత్నం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు ముఖ ద్వారమైన పట్టినపాలెం వంతెన పూర్తి చేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం గుబ్బల మంగమ్మ ఆలయానికి వందలాదిమంది భక్తులు ప్రయాణిస్తున్న ఈ వంతెన ప్రధాన సమస్యను ఎవరూ పరిష్కరించడంలేదన్నారు. గత 15 ఏళ్లుగా ప్రభుత్వాలు మారినా ఈ నిర్మాణం పూర్తి చేయడంలో విఫలమయ్యారన్నారు. వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో కురిసిన వర్షాలకు గతంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వైద్యం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి రావాలంటే ఏజెన్సీ ప్రజలు ముప్పు తిప్పలు పడుతున్నారన్నారు. గర్భిణులు డెలివరీ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ వంతెన కింద రోడ్డు కొట్టుకుపోవడంతో తినడానికి నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు కూడా అవకాశం లేదన్నారు. తక్షణమే ఏజెన్సీ ప్రాంతాలకు బియ్యం, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పట్టినపాలెం వంతెన దగ్గర నుంచి జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. మండల కమిటీ సభ్యులు ప్రభాకరరావు, దుర్గారావు, బోడిగ వసంతరావు, పూసం చంద్రరావు, కురసా రాముడు, బోడిక దుర్గారావు, కూసం రామారావు పాల్గొన్నారు.

అత్యాచారానికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

వ్యకాస ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

గిరిజన మహిళలపై అత్యాచారానికి యత్నించి దౌర్జన్యానికి పాల్పడిన పర్వతనేని బ్రహ్మాజీ, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎఎస్ఆర్ నగర్ మెట్ట వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల నాయకులు మడకం సుధారాణి, అనుమలు మురళి మాట్లాడుతూ గిరిజనులు, దళితులు సాగు చేసుకుంటున్న భూముల్లో స్థానిక భూస్వామి పర్వతనేని బ్రహ్మాజీ అతని అనుచరులు మహిళలపై దాడులకు పాల్పడ్డారన్నారు. దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషిస్తూ మహిళల వస్త్రాలు చించి అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. వారిపైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్ఐకు ఫిర్యాదు చేసినా ఆ ఎస్ఐ చులకనగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. కేసు నమోదు చేయకుండా భూస్వాములతో మాట్లాడుకోవాలని రాయబారాలు నడపడం చట్ట విరుద్ధమన్నారు. చట్టాన్ని అనుసరించి బాధితులకు న్యాయం చేయాల్సిన అధికారులే భూస్వాములకు అండగా నిలబడడం దుర్మార్గమన్నారు. వెంటనే ఎస్ఐ స్పందించి బాధితులు పెట్టిన కేసు నమోదు చేసి దాడులు చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఆందోళన చేస్తున్న వ్యకాస నేతలు, మహిళలు

మా తీర్మానాలు లేకుండా ఎలా పనిచేస్తారు?

అధికారులు ప్రొటోకాల్ పాటించడంలేదు

చాట్రాయి సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి నిర్మల

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహించేటప్పుడు తమకు సమాచారం ఇవ్వడంలేదని, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రొటోకాల్ ప్రకారం పిలవడం లేదని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాట్రాయి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ మంగాకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు చెలికాని అనూష మాట్లాడుతూ గడిచిన నెలలో పెన్షన్ కార్యక్రమానికి పిలవలేదని, ప్రభుత్వ అధికారులు కనీసం సమాచారం కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి లంకా నిర్మల మాట్లాడుతూ ఇంకా సంవత్సరంన్నర పాటు తాము అధికారంలో ఉంటామని, గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు, సంక్షేమ కార్యక్రమాలకు తమ తీర్మానాలు లేకుండా ఎలా పనిచేస్తారని అధికారులను నిలదీశారు. జనార్ధనవరం ఎంపిటిసి సభ్యులు పోతిరెడ్డిపల్లి కృష్ణ, కృష్ణారావుపాలెం ఎంపిటిసి సభ్యులు చింతకుంట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో ప్రభుత్వ అధికారులకు పనిలేదా, టిడిపి అధికారంలోకి రాగానే ఆ పార్టీ నాయకులతో కార్యక్రమాలు చేయించుకుంటారా, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు సహకరించమని, కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారో చూస్తామని అన్నారు. అనంతరం వ్యవసాయ శాఖాధికారి బి.శివశంకర్ మాట్లాడుతూ చాట్రాయి మండలంలో 11 వేల ఎకరాల వరి సాగు జరుగుతుందని, జనార్ధనవరం, బూరుగుగూడెం, చాట్రాయి గ్రామాల్లో వరి నాట్లు పూర్తవుతున్నాయన్నారు. కౌలు రైతులు సాగు హక్కు పత్రం పొందాలని, ఇ క్రాప్ ద్వారా రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని చెప్పారు. అలా చేయించుకున్న ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తుందన్నారు. విద్యాశాఖాధికారి బ్రహ్మచారి మాట్లాడుతూ చాట్రాయి మండలంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఐదుగురికి ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని చెప్పారు. చాట్రాయి మండలంలో ఉన్న 68 పాఠశాలల్లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. తహశీల్దార్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ కౌలు రైతులు 1600 మందికి కౌలు రైతు పత్రాలు ఇవ్వాలని టార్గెట్ ఉందని, ఇప్పటివరకు 800 మందికి ఇచ్చామని చెప్పారు. గతంలో ఇచ్చిన కుల ధ్రువీకరణ పత్రాలపై సర్వే నిర్వహించి సుమోటో కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పర్మినెంట్ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఫారెస్ట్ డిఆర్ఒ హరిగోపాల్ మాట్లాడుతూ అంతరించిపోతున్న, ఆక్రమణకు గురవుతున్న అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఇంటి దగ్గర చెట్లను నాటుకోవాలని, వాటి ద్వారా స్వచ్ఛమైన గాలి మనకు లభిస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇళ్లలో పరిశుభ్రత పాటించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల కుట్టకుండా దోమతెరలు వాడాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ మురళీమోహన్ పాల్గొన్నారు.

పోరంబోకు భూముల విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

ముసునూరు సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపిపి

ప్రజాశక్తి - ముసునూరు


మండలంలోని అటవీ పోరంబోకు భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుని అధిక మొత్తంలో అమ్ముకునే విధంగా కొందరు వ్యవహరిస్తున్నారని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన నూజివీడు రెవెన్యూ డివిజనల్ అధికారి వై.భవానిశంకరి దష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొండా దుర్గాభవాని అధ్యక్షతన ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నూజివీడు రెవెన్యూ డివిజనల్ అధికారి వై.భవానిశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతు సేవ కేంద్రాల ద్వారా విత్తనాలు ఇవ్వడం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రం వరకు పలు సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంఇఒ బివి.సుబ్బారావు మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో 50 పాఠశాలలో అన్ని మౌలిక వసతులు ఉన్నాయన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ మాట్లాడుతూ లోపూడి, రమణక్కపేట, గోపవరం గ్రామాల్లోని ఆయా పాఠశాలల్లో ఆర్ఒ ప్లాంట్ పనిచేయడం లేదని చెప్పారు. వైద్యులు షకీనా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడుతూ మండల పరిధిలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్యులు ఆయా గ్రామాల పరిధిలో ప్రతిరోజు హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఉద్యానవన శాఖాధికారి కె.జ్యోతి ప్రియాంక మాట్లాడుతూ పండ్లు, కూరగాయల మొక్కల పెంపకానికి 40 శాతం రాయితీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. సమావేశానికి ముసునూరు పశు సంహార్థక వైద్యులు, సిబ్బంది హాజరు కాలేదు.

ఎర్ర కాలువకు వరద నీరు

ప్రజాశక్తి -జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం కొంగవారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయానికి వరద నీరు పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 82.60 మీటర్ల చేరుకుంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 25 వేల క్యూసెక్కుల నీరు చేరగా ప్రాజెక్ట్ నాలుగు గేట్ల ద్వారా 14,524 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

చింతలపూడి :మండలంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌లో కాచ్ మెంట్ ఏరియాలో వర్షం, ఎగువ నుంచి వస్తున్న వరద 3426 క్యూసెక్కులుగా ఉన్నట్లు ఎఇఇ పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులు కాగా ప్రస్తుతం 344.24 అడుగులకు, గొనెల వాగు బేసిన్ 342.2 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం మూడు టిఎంసిలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 1.337 టిఎంసిలు ఉందని పరమానందం తెలిపారు.



ఎర్రకాలువ

తమ్మిలేరు నీటి ప్రవాహం పరిశీలన

ఏలూరు సిటీ :గత వైసిపి ప్రభుత్వ తప్పిదాల కారణంగా అన్ని వ్యవస్థలు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు పోణంగి వద్ద ఉన్న బ్రిడ్జి వద్ద తమ్మిలేరు నీటి ప్రవాహాన్ని శనివారం ఆయన పరిశీలించారు. గుర్రపు డెక్క తొలగించే పనులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. సర్ సిఆర్ఆర్ కళాశాల వంతెన వద్ద గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

నీట మునిగిన పొలాల పరిశీలన

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

వర్షాలకు మండలంలోని లక్కవరంలో కరాటం జలశయం ప్రాజెక్టు నుంచి నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో లక్కవరం, పంగిడిగూడెం గ్రామాల్లో పంట నష్టం వాటిల్లింది. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అధికారులతో కలిసి పొలాలను పరిశీలించారు. వరదల కారణంగా లక్కవరం నుంచి పంగిడిగూడెం రోడ్డు మార్గం పాడైపోవడంతో ఎంఎల్ఎ బైక్‌పై నాలుగు కిలోమీటర్ల పర్యటించారు.

ఆగిరిపల్లి :వరి పొలాల్లో నీరు బయటకు వెళ్లేలా రైతులు చర్యలు తీసుకోవాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు కోరారు. మండల పరిధిలోని సగ్గూరు, కృష్ణవరం గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేరుగా విత్తిన వరి పొలాల్లో నీరు నిల్వ ఉంటే నీటిని బయటకు తీసేసిన తర్వాత ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ వేయాలని, లీటర్ నీటికి రెండు గ్రాముల మ్యాంకోజెబ్ లేదా కార్బండిజమ్ మందును పిచికారీ చేయాలన్నారు.

ఉంగుటూరు :ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తి పంట పొలాలను ముంచెత్తడంతో నారు కుళ్లిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాచుగుంట, బాదంపూడి, కైకరం, రామన్నగూడెం తదితర ఆయకట్టు ముంపునకు గురైన పొలాలను వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తల బృందం శనివారం పరిశీలించారు. నీట మునిగిన చేలో వరి కుళ్లిపోకుండా చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఇమ్మణి గంగాధరరావు, చిట్టూరి హరిబాబు, పాతూరి విజయకుమార్ కోరారు.

పోలవరం :మండలంలో కొత్త పట్టిసీమ, ప్రగడపల్లి, వింజరం, పోలవరం గూటాల గ్రామాల పరిధిలో నీట మునిగిన పొలాలను వ్యవసాయశాఖ అధికారులు శనివారం పరిశీలించారు. గూటాలలో కొవ్వాడ కాలువ దాటికి నీటమునిగిన పొలాలను మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలో 60 ఎకరాలు నారుమళ్లు, 1462 ఎకరాల వరి నాట్లు నీట మునిగినట్లు తెలిపారు.

ముసునూరు :వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ వై.భవానీశంకరి సూచించారు. తమ్మిలేరు పరివాహక గ్రామాలైనా బలివే, ఎల్లాపురం, రంగంపేట, వెంకటాపురం, లోపూడి, గుల్లపూడి గ్రామాల్లో ఆమె శనివారం పర్యటించి పరిశీలించారు. తమ్మిలేరు తాత్కాలిక రహదారిపై ప్రయాణాలు నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు.

బుట్టాయగూడెం :మండలంలోని విప్పలపాడు, కోటనాగవరం, రేగులకుంట, సీతప్పగూడెంతో పాటు పలు గ్రామాల్లో పొలాలను వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు వరి నారుమడులు 175 ఎకరాలు, వరినాట్లు 115 ఎకరాలు, మొక్కజొన్న 22 ఎకరాలు, ప్రత్తి 115 ఎకరాలు సాగు నమోదైందని తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 55 ఎకరాల వరి నారుమడులు, 75 ఎకరాల నాట్లు వేసిన వరి, 35 ఎకరాల ప్రత్తి పంట నీట మునిగినట్లు తెలిపారు. నీరు బయటకు వెళ్లేందుకు రైతులు చర్యలు తీసుకోవాలన్నారు.

చాట్రాయి :మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలను, నారు మడులను, పత్తి పైరును తహశీల్దార్ మహమ్మద్‌అలీ, వ్యవసాయ శాఖాధికారి బి.శివశంకర్ పరిశీలించారు. మండలంలోని చాట్రాయి, నరసింహారావుపాలెం, బూరుగుగూడెం గ్రామాల్లోని వరి పొలాలను వారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెదజల్లే వరి పైరు నీటిలో నిండి ఉండకుండా నీటిని కాలువల ద్వారా బయటకు పంపాలని రైతులకు సూచించారు. వరి నారుమడులు మూడు నుంచి ఐదు రోజులపాటు మడిలో నీరు నిల్వ ఉంటే నారు పాడవుతుందన్నారు. నీటిని బయటికు తీసిన తర్వాత ఒక కేజీ యూరియా, ఒక కేజీ పొటాష్ కలిపి నారుమడులకు చల్లాలని చెప్పారు.